సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 7 । ఆగస్టు । 2024



30 రోజులు.. 15 చోరీలు

టెక్కలిలో దొంగలు రెచ్చిపోతున్నారు. 30 రోజుల్లో 15 చోరీలు చేశారు. - 8లో



విరాళాల ముసుగులో..

డ్వాక్రా సభ్యుల నుంచి రూ.100 చొప్పున వసూలు చేస్తారు. ఈ మేరకు ఓ ఆడియో క్లిప్పింగ్ వైరల్ అవుతోంది. - 8లో

ఎండల మల్లన్న హుండీ ఆదాయం లెక్కింపు

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జున స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ ఆదాయం లెక్కింపు చేపట్టారు. ఆమదాలవలసకు చెందిన ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.రవి, మల్లన్న ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించారు. 151 రోజులకు సంబంధించి సుమారు రూ.1,83,252 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

న్యూస్‌రీల్

నువాగడ ఆశ్రమ విద్యార్థులకు మలేరియా



ఆశ్రమ పాఠశాలలో పరిస్థితిని పరిశీలిస్తున్న డీఎంఓ పీవీ సత్యనారాయణ

కంచిలి: మండలంలోని నువాగడ గ్రామంలో గల ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులు మలేరియాతో బాధ పడుతున్నారు. ఈ విషయాన్ని కంచిలి పీహెచ్‌సీ వైద్యాధికారులు గుర్తించారు. దీంతో ఇక్కడి పరిస్థితి తీవ్రతను తెలుసుకొని జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ మంగళవారం ఇక్కడికి వచ్చి పరిశీలించారు. విద్యార్థులకు మలేరియా సోకిందని స్పష్టమవ్వగానే అధికారులు ఆశ్రమ పాఠశాల ప్రాంగణం, నువాగడ గ్రామంలోనూ ఏఎల్‌ఓ ఫీవర్ సర్వే, లార్వా సర్వే , ఫాగింగ్, ఐఆర్‌ఎస్ ఫోకల్ స్ప్రేయింగ్ చేశారు. ఆశ్రమ విద్యార్థుల ఆరోగ్యంపై ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని పాఠశాల హెచ్‌ఎం దుర్గాప్రసాద్ పాఢిని, మిగతా ఉపాధ్యాయ సిబ్బందిని సూచించారు. విద్యార్థుల పరిస్థితి నిలకడగానే ఉంది.

మూడో విడత ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఐటీఐలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ కౌన్సెలింగ్‌లో మిగులు సీట్లలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఐటీఐ.ఏపీ. జీవోవీ.ఐఎన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు సమయంలో ప్రవేశం కోరుకునే ఐటీఐకి ఆప్షన్ ఇచ్చుకోవాలని వివరించారు. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 26తో ముగుస్తుందని అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ ఐటీఐల్లో దరఖాస్తు పరిశీలనకు హాజరు కావాలని చెప్పారు. 27వ తేదీలోపు వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నవారు మాత్రమే ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. 29వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందని అన్నారు.

రోడ్డున పడ్డ ఒంటరి మహిళ



ఈమె పేరు డొంకాన బృందావతి. పలాస మండలం దిప్పిపురం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కార్మికురాలిగా పనిచేస్తుంది. గత 20ఏళ్లుగా పిల్లలకు వండి పెడుతోంది. టీడీపీ నాయకులు బలవంతంగా ఒత్తిడి తీసుకొచ్చి రాజీనామా చేయించారు. ఈమెకు భర్త లేరు. మధ్యాహ్న భోజనం పథకమే ఆధారం. దానిని కూడా తీసేశారు. ఇప్పుడామె రోడ్డున పడింది.

వృద్ధురాలని కూడా చూడలేదు



ఈమె పేరు నీల గోవిందమ్మ. పలాస మండలం కృష్ణపురం గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. రూ.6వేల జీతం అందుతుండటంతో భార్యభర్తల జీవనం సాగుతోంది. ఈమెను కూడా స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు బెదిరించారు. ప్రతిఘటిస్తే ఇంటి పైకి వెళ్లి గొడవకు దిగారు. దీంతో గోవిందమ్మ స్వచ్ఛందంగా తప్పుకుంది.


మానసిక వేధింపులు



ఈమె పేరు ఊర్ల కృష్ణవేణి. వెంకటాపురం పీహెచ్‌సీ పరిధిలో 11 ఏళ్లుగా ఆశా వర్కర్‌గా పనిచేస్తోంది. కృష్ణవేణిని తప్పించేందుకు టీడీపీ నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ ఆమె తగ్గడం లేదు. నేనేం తప్పు చేశాను, నేనెందుకు తప్పుకోవాలని మొండిగానే నిలబడింది. అవసరమైతే న్యాయస్థానానికి వెళ్లేందుకు సిద్ధమంటోంది.

● చిరుద్యోగుల పొట్ట కొట్టి

ఆ పోస్టులకు వేలం పెట్టి



- కూటమి నాయకుల కక్ష సాధింపుతో రోడ్డున పడుతున్న వేతన జీవులు
- స్కీమ్ కార్మికులపై టీడీపీ నాయకుల ప్రతాపం
- బెదిరింపులతో రాజీనామా చేయిస్తున్న పరిస్థితి
- అన్యాయంపై ఉద్యమానికి సిద్ధమైన కార్మిక సంఘాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టీడీపీ కక్ష సాధింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. తమకు అనుకూలంగా లేని చిరుద్యోగులను తీసేస్తూ వారి బతుకులను రోడ్డున పడేస్తున్నారు. అంతే కాదు ఈ పోస్టులను ఇష్టమొచ్చిన ధరలకు అమ్ముకుంటున్నారు. సంతబొమ్మాళి మండలం లక్కివలస పంచాయతీ గద్దలపాడు గ్రామంలో స్కీమ్ కార్మికుల పోస్టులకు వేలం పాట నిర్వహించారు. దీనిలో గెలుచుకుని ఉద్యోగాలు పొందాలని గ్రామ పెద్దలు తీర్మానం చేశారు. అంగన్‌వాడీ పోస్టు రూ.లక్షా 90వేలు, ఆశ వర్కర్ పోస్టు రూ. లక్షా 80వేలు, డీలర్ రూ. 30వేలు, సీఎఫ్ పోస్టు రూ. 30వేలు, పాఠశాల స్వీపర్ పోస్టుకు రూ. 10వేలకు ఉద్యోగాల ధర నిర్ణయించారు. అంగన్‌వాడీ కార్యకర్త, ఆశా వర్కర్ తప్ప మిగిలిన పోస్టులు చేస్తున్న వారే ఆ ధరకు వేలంపాట పాడుకుని తమ ఉద్యోగాలను నిలబెట్టుకున్నారు.


కూటమి ప్రభుత్వం వస్తే తమ బతుకులు మరింత మారిపోతాయని చిరుద్యోగులు ఆశించారు. కానీ వారు అధికారంలోకి వచ్చాక అంచనాలు తలకిందులయ్యాయి. తమ ఉద్యోగాలకే ఎసరొచ్చే పరిస్థితులు నెలకున్నాయి. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న వారిని రాజకీయ ముద్ర వేసి తీసేయాలని చూస్తున్నారు. కొందర్ని బెదిరించి తప్పుకునేలా చేస్తున్నారు. మరికొందరిపై ఫిర్యాదులు పెట్టి వేధించి తీయించేస్తున్నారు. వారి స్థానంలో తమకు కావాల్సిన వారికి, నచ్చినంత ధర పెట్టి అంగడి సరుకుగా విక్రయించి భర్తీ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులతో పాటు ఆశా కార్యకర్తలు, డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వీఎఓలు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులపై ప్రధానంగా దృష్టి పెట్టారు.

ఇక మేం చేస్తాం అంటూ..

టెక్కలి, గార, సంతబొమ్మాళి, పలాస, మందస, వజ్రపుకొత్తూరు, నందిగాం తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటివరకు మీరు ఉద్యోగాలు చేశారు.. ఇప్పుడు మా వాళ్ల ఉద్యోగాలు చేస్తారని వేధింపులకు దిగుతున్నారు. వాస్తవంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న చిరుద్యోగులకు సర్వీసు కండిషన్లు, పని గంటలు, పని విధి విధానాలు ఉన్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా వీరి ద్వారానే ప్రజా పాలన అందుతుంది. వీరిపైనా కూటమి నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. వీరి వైఖరితో చిరుద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే బాధితులంతా రోడ్డెక్కారు. రెండు రోజుల క్రితం కలెక్టరేట్ ఎదుట నిరసనకు సైతం దిగారు. అధికార పార్టీ నాయకులు వైఖరీ మార్చుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేయాల్సి వస్తుందని ఇప్పటికే సంబంధిత కార్మిక సంఘాలు హెచ్చరించాయి.

రెండు నెలల్లోనే..

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 80 మందికి పైగా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించారు. ఎనిమిది మంది రేషన్ డీలర్లను తొలగించారు. ఫీల్డ్ అసిస్టెంట్లను వందల్లోనే తీసేసే పరిస్థితులు కనబడుతున్నాయి. ఇప్పటికే మండలాల వారీగా తొలగించాల్సిన వారి జాబితాను తయారు చేశారు. వీరిపై ఎలాంటి కారణాలు చూపించి, తొలగించాలన్న దానిపై కసరత్తు చేస్తున్నారు. దాదాపు ప్రతి మండలంలోనూ ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. రేషన్ డీపో డీలర్ల పరిస్థితి కూడా అంతే. కానీ వారందరినీ ఏరివేసే పనిలో నిమగ్నమయ్యారు. ఫిర్యాదులపై ఫిర్యాదులు చేసి అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల తొలగింపు ప్రక్రియ నడుస్తోంది. భారీ సంఖ్యలో వేటు వేసే అవకాశం కనబడుతోంది. మొన్నటి ఎన్నికల్లో కూటమికి అనుకూలంగా పనిచేయని వారెవరో గుర్తించి, వారిని తప్పించేందుకు సాకులు వెతుకుతున్నారు. అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లతో తొలగించేందుకు సిద్ధం చేసిన జాబితాలు ఇప్పటికే ఆయా కార్మిక సంఘాల వద్ద ఉన్నాయి. పరిస్థితులు ఆందోళనకరంగా ఉండటంతో సంఘాల నాయకుల అప్రమత్తమై కూటమి ప్రభుత్వానికి సమయమివ్వడం సరికాదని త్వరగా రోడ్డెక్కారు. ఏకంగా కలెక్టరేట్ ఎదుట నిరసనలకు దిగారు. ఇది ఆరంభం మాత్రమే మున్ముందు ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



షోకాజ్ నోటీస్

నందిగాం మండలం కొత్త అగ్రహారానికి చెందిన మద్దు సావిత్రి 20 ఏళ్లుగా స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట కార్మికురాలుగా పని చేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆమెను ఎలాంటి కారణం లేకపోయినా తొలగించారు. స్థానిక టీడీపీ నేత ఒత్తిడితో ఎంఈవో షోకాజ్ నోటీస్ జారీ చేసి తొలగించారు. తనకు జరిగిన అన్యాయంపై ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సావిత్రి కుమారుడు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా గ్రామంలో పని చేశారనే ఏకైక కారణంతోనే ఇలా చేశారని ఆమె ఆరోపిస్తున్నారు.

అధికారం ఇచ్చింది ఇందుకా..



కుటుంబాన్ని పోషించేందుకు నిరంతరం కష్టపడి పనిచేస్తున్న ఆశావర్కర్లపై కక్షసాధింపు చర్యలు సరికాదు. చాలా కాలంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న చిరుద్యోగులపై రాజకీయ నాయకుల ప్రతాపం సరికాదు. కూటమి ప్రభుత్వానికి ప్రజలిచ్చిన మెజార్టీని సంక్షేమం అందించేందుకు ఉపయోగించాలే తప్ప ఉద్యోగాలను తీసి రోడ్డున పడేయడానికి కాదు.

– కె.నాగమణి, ఆశావర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు, సీఐటీయూ, శ్రీకాకుళం జిల్లా

చిరుద్యోగులపై రాజకీయ కక్ష తగదు

సంతబొమ్మాళి మండలం బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శ్రీపురం ఆశావర్కర్‌గా 15 ఏళ్లుగా పనిచేస్తున్నాను. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నానని ఉద్యోగానికి రాజీనామా చేయాలని స్థానిక టీడీపీ నాయకులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లినా పట్టించుకోలేదు. దీంతో యూనియన్ నాయకులు దృష్టికి తీసుకుని వెళ్లాను. కలెక్టరేట్ వద్ద చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నాను. మాలాంటి చిరుద్యోగులపై రాజకీయం చేయడం తగదు.

– బొంగు రాణి, ఆశావర్కర్, శ్రీపురం గ్రామం. బోరుభద్ర పీహెచ్‌సీ, సంతబొమ్మాళి మండలం.

కక్ష సాధింపు చర్యలు సరికాదు..



కొత్త ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు తీసి వాటినే కొత్త ఉద్యోగాలుగా చిత్రీకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2130 ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలు తీసేశారు. దర్యాప్తు పేరుతో తొలగించడం అన్యాయం. జిల్లాలో సుమారు 70మంది వరకు ఇప్పటికి తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. కక్ష సాధింపులు ఉండవని చెబుతూనే ఆ దిశగానే కూటమి పాలన జరుగుతోంది.

– బోర శ్రీరామ్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, లావేరు మండలం, లక్ష్మీపురం,

● ఖాళీ కంచాలతో ధర్నా



ఉపాధి వేతనాలు చెల్లించాలంటూ మండలంలోని గొట్టిపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని ఉపాధి వేతనదారులు సచివాలయం వద్ద మంగళవారం ఖాళీ కంచాలతో ధర్నా చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్నలు మాట్లాడుతూ ఉపాధి పనులు చేసి 8 వారాలు గడుస్తున్నా వేతనాలు చెల్లించలేదని తెలిపారు. వేతనాలు చెల్లించకుంటే దశల వారీగా ఉద్యమం తప్పదన్నారు. అనంతరం వినతి పత్రంను గ్రామ సచివాలయం వెల్‌ఫేర్ అసిస్టెంట్ లక్ష్మికి అందజేశారు. –కొత్తూరు

● హరితాంధ్రప్రదేశ్..



పలాస మండలం లొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో చిన్నారులు ఆకు పచ్చని మొక్కలతో ఆంధ్రప్రదేశ్ ఆకారాన్ని ఏర్పాటు చేశారు. మొక్కలకు ప్రతిరోజూ నీరు పోసి పచ్చగా పెంచుతున్నారు. భారతదేశ పటం, ఆశ్రమ పాఠశాల లొత్తూరు అనేక అక్షరాలను సైతం పచ్చని మొక్కలతో పెంచుతున్నారు.

-కాశీబుగ్గ

● వంతెన పరిశీలన



సంతబొమ్మాళి పంచాయతీ జగన్నాథపురం వద్ద లేఅవుట్‌కు అనుకొని వంశధార కాలువపై నిర్మించిన వంతెనను వంశధార ఏఈలు వి.సింహాచలం,శోభన్‌బాబులు పరిశీలించారు. 'వంశధార కాలువపై అనధికార వంతెన' అనే శీర్షిక మంగళవారం 'సాక్షి'లో వార్త ప్రచురితం కావడంతో వంశధార శాఖ అధికారులు స్పందించారు. వంశధార కాలువపై వంతెన నిర్మాణానికి ఎట్టి అనుమతులు లేవని, దీనికి సంబంధించిన రిపోర్ట్‌ను రెవెన్యూ అధికారులకు, వంశధార శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. – సంతబొమ్మాళి



జల్లేపల్లి కాంతమ్మ

అక్కడ కార్మికుడు కళాకారుడిగా మారగలడు. ఏ డిగ్రీ పట్టా లేని నేతన్న వాలుగు చేపకు కొండపత్తికి ముడి పెట్టగలడు. ఏ డాక్టరేట్లు లేని శ్రామికుడు ముతక బట్టను ఆవుపేడతో తెల్లగా మార్చేయగలడు. పొందూరు ఖాదీ ఇలాంటి ఆశ్చర్యాలెన్నింటినో తనలో పొదువుకుంది. ఇక్కడ పోగు నుంచి వస్త్రం వరకు అడుగడుగునా యుద్ధం జరుగుతుంది. అందుకే ఓ ఖాదీ వస్త్రం.. నేతన్న ఇష్టంగా తయారు చేసుకున్న అస్త్రంలా కనిపిస్తుంది. – పొందూరు/జి.సిగడాం



కుంబికి సిద్ధం చేసిన ఖాదీ వస్త్రాలు

ఖాదీ వస్త్రం.. ఇది కార్మికుని అస్త్రం



- పొందూరు ఖాదీకి ఖండాంతర ఖ్యాతి
- ప్రతి అడుగులోనూ కనిపించే కళాత్మకత
- ఏటా రూ.8 కోట్ల వ్యాపారం

నేడు జాతీయ చేనేత దినోత్సవం

మన ఖాదీతో మోదీ..

గత ఏడాది ఎర్రకోటలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ సంబరాల్లో పాల్గొనేందుకు పొందూరుకు చెందిన నేతకారులు కాంతమ్మ, భద్రయ్యలకు ఆహ్వానం అందింది. వీరిద్దరూ ఢిల్లీకి వెళ్లి.. వేడుకలను వీక్షించి.. ప్రధానితో ముచ్చటించారు.

కాంతమ్మా.. కుశలమా..



ఈమె పేరు జల్లేపల్లి కాంతమ్మ. పొందూరు. వయసు 76. ఆరేళ్ల ప్రాయం నుంచి సంప్రదాయ ఖాదీ వస్త్రం తయారు చేస్తోంది. దేశంలోనే నూలును నాణ్యంగా వడికే నైపుణ్యం గల అతికొద్ది మంది వ్యక్తుల్లో కాంతమ్మ ఒకరు. రోజుకు 6 గంటలు ఇదే పనిలో నిమగ్నమవుతున్నారు. కేవలం రోజుకు రూ.200 మాత్రమే సంపాదిస్తున్నా.. కోట్ల రూపాయల విలువైన తృప్తి కోసమే తాను ఈ పని చేస్తున్నానని గర్వంగా చెబుతున్నారు ఆమె.




కాంతమ్మ ఎంచుకున్న సంప్రదాయ విధానం ఏమిటి..

1. వాలుగు చేప ముల్లుతో పత్తిని శుభ్రపరచడం
2. నిడుచుటగా పిలిచే ప్రక్రియలో పత్తి గింజలను వేరు చేయడం
3. పింజ తీసి పొట్టు తీయడం
4. పత్తిని మెత్తగా తయారు చేయడం
5. ఏకు చుట్టడం 6. వడకడం
7. చిలపలు పోయడం




వాలుగు 'చేప'ట్టాల్సిందే..



ఖాదీ వస్త్రాల తయారీకి ముడి కొండపత్తిలోని పొల్లు తీసి శుభ్రం చేసేందుకు వాలుగు చేప ముల్లు మాత్రమే ఉపయోగపడుతుంది. ఆ చేప దవడ పలు వరుసతో ఉండే ప్రత్యేకమైన ముల్లుతోనే ఈ పని జరుగుతుంది. కానీ ఆ చేపలు ఇప్పుడు అంతగా దొరకడం లేదు. అచ్చు ఇలాగే ఉండే పరికరాన్ని తయారు చేసేందుకు మహారాష్ట్ర వార్ధాలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ ఇండస్ట్రియలైజేషన్(ఎంజీఐఆర్ఐ) సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త మహేష్‌కుమార్ ఆధ్వర్యంలోని ఓ బృందం ప్రయత్నిస్తున్నా ఇంకా సఫలం కాలేదని పొందూరు ఏఎఫ్‌కేకే సెక్రటరీ డి.వెంకటరమణ తెలిపారు. వేరే చేప ముల్లును కూడా వినియోగించేందుకు చూస్తున్నామన్నారు.

కొంగొత్తగా..



- పొందూరు ఖాదీని విదేశీయులెందరో సందర్శించారు. ఇటలీ, జర్మనీ, కెనడా, యూఎస్‌ఏ, నార్వే, థాయ్‌లాండ్ దేశాల నుంచి ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు, ప్రముఖులు సందర్శించారు.
- పంజాబ్, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి నగరాల్లో ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు వచ్చి పొందూరు ఖాదీపై ప్రాజెక్టులను తయారు చేశారు.
- ఖాదీ పరిశ్రమలో సరికొత్త పోకడలకు సంబంధించి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్‌ఐడి) డిపార్ట్‌మెంట్ సందర్శించింది.
- ఈ వస్త్రాల నమూనాలతో హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, భోపాల్, గాంధీనగర్, కన్నూర్, కోల్‌కతా, ముంబై, పుణే, భువనేశ్వర్‌లలో తమ విద్యార్థులకు డిజైనింగ్ తదితర ప్రక్రియల్లో శిక్షణ ఇస్తున్నారు.

ఆ శ్వేత వర్ణ కాంతుల వెనక... కుంబి



అంతర్జాతీయ ఖ్యాతిని సొంతం చేసుకున్న మన పొందూరు ఖాదీ ఇంతగా ప్రసిద్ధి చెందడానికి బట్ట సుతిమెత్తగా ఉండడం, ఆకట్టుకునే తెలుపు రంగు ప్రధాన కారణాలు. అయితే ఇక్కడ వాడే వస్త్రం అసలు రంగు తెలుపు కాదు. ఆ ఆకట్టుకునే తెలుపు రంగు తీసుకురావడానికి 'కుంబి' అనే ప్రత్యేక పద్ధతిని పాటిస్తారు.

ఏమిటీ 'కుంబి'..

నేతన్నలు తయారు చేసే వస్త్రం ముతకగా ఉంటుంది. ఈ కోరా బట్టను తెలుపు రంగులోకి తేవడానికి ఆనందపురం గ్రామంలోని రజకులు ప్రత్యేకంగా పనిచేస్తారు. కోరా బట్ట తెలుపు రంగులోకి తీసుకురావడానికి ముడి సరుకులతో కలిపి 10 నుంచి 14 రోజుల పాటు శ్రమిస్తారు. అనంతరం వీటిని పొందూరుకు అందిస్తారు.

- కోరా బట్టలను తెలుపు చేసేందుకు (కుంబి) వీరు పలు ముడి సరుకులను వినియోగిస్తారు. అందులో అతి ముఖ్యమైనది ఆవు పేడ. ఆవు పేడతో ముతక రంగులోని వస్త్రాన్ని రెండు రోజులపాటు ఉడికిస్తారు.
- ఉడికించిన వస్త్రాలను మరో రెండు రోజుల పాటు వాషింగ్ చేసేందుకు సోడాకారం, సున్నం పెట్టి ఆవిరితో బాయిలింగ్ చేస్తారు.
- తరువాత బ్లీచింగ్, సోడాకారం కలిపి రెండు రోజుల పాటు నిల్వ చేస్తారు.
- వాషింగ్ అయిన తర్వాత నీలిమందు, గంజి, టినాపాల్‌తో ఉంచుతారు.
- మూడు రోజుల తర్వాత ఆ దుస్తులను ఆరబెడతారు.
- అనంతరం ఇస్త్రీ చేసి మడతలు పెట్టి సంబంధిత యజమానులకు అందిస్తారు.



'జరీ' నేతకే మొనగాడు..



చిత్రంలో వీరిద్దరి పేర్లు భద్రయ్య, లక్ష్మి. భార్యభర్తలు. ఊరు పొందూరు. జరీపంచె నేతలో ఒకే ఒక్కడు ఈ భద్రయ్య. మంచి నైపుణ్యం ఈయన సొంతం. ఏఎన్నార్ పేరుతో పిలిచే ఖాదీ పంచెకు బంగారం వర్ణంలో ఉండే అంచును అత్యంత అద్భుతంగా నేయడంలో ఈయనది అందెవేసిన చేయి.

పొందూరు వైభవం					
పొందూరులో ఖాదీ, చేనేత కార్మికులు సుమారు 900 మంది	పొందూరు నూరవ కౌంట్ ఖాదీ వస్త్రం ఖండాంతర ఖ్యాతి గడించింది. ప్రస్తుతం ఈ వస్త్రం మీటరు ధర రూ.2,107 లు ఉంది.	ఖాదీ వస్త్రం మీటరు ధర రూ.341 నుంచి రూ. 2,107 వివిధ ధరల్లో లభిస్తున్నాయి	పంచెలు రూ.2 వేలు నుంచి రూ.10 వేలు, చీరలు రూ.6 వేలు నుంచి రూ.15 వేలు వరకు ఉన్నాయి	ఇక్కడ తయారవుతున్న ఏఎన్ఆర్ అంచుపంచెలు ఎంతో విశిష్టత సంతరించుకున్నాయి.	పొందూరులో ఖాదీ వస్త్ర వ్యాపారం టర్నోవర్: ఏడాదికి రూ.8 కోట్లు

క్లుప్తంగా

బోటు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి



వాడ ధర్మారావు(ఫైల్)

సోంపేట: మండలంలోని గొల్లగండి పంచాయతీ రామయ్యపట్టణం గ్రామానికి చెందిన మత్స్యకారుడు వాడ ధర్మారావు(50) చెన్నైలో బోటు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారావు జీవనాధారం కోసం చెన్నైలో వలస మత్స్యకారుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈయనకు భార్య జానకి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా, ఇతర రాష్ట్రాల్లో జరిగిన ప్రమాదాల్లో మత్స్యకారులు మృతి చెందితే అక్కడి అధికారులు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయడం లేదు. దీంతో ప్రమాద బీమా అందడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందజేసి వలస మత్స్యకారులకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

'ఫోన్ ఇన్'లో రైతులకు సూచనలు



కేవీకేలో ఫోన్ ఇన్ కార్యక్రమంలో రైతులకు సూచనలు అందిస్తున్న డాక్టర్ కిరణ్ కుమార్

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం రైతులతో ఫోన్ ఇన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ సుమారు 50 మంది రైతులతో మాట్లాడారు. ఇందులో రైతులు వరిలో కలుపు యాజమాన్యం గురించి, సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. కలుపు యాజమాన్యం సరైన పద్ధతిలో సరైన సమయంలో చేసుకోవాలని, కలుపు మందుల వాడకంలో జాగ్రత్తలు గురించి వివరించారు. నత్రజని వాడకాన్ని మోతాదులో వాడి పొటాష్ వాడకాన్ని అందరూ అలవాటు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బూర్జ: మండలంలోని పెద్దపేట జంక్షన్‌లో పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సీతంపేట మండలం వలగెడ్డ గ్రామానికి చెందిన ఆరిక మణికంఠ ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి వెనుక భాగానికి బలంగా ఢీకొట్టాడు. రోడ్డుపై పడి గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి 108 వాహనంలో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కార్యాలయంలో చోరీ

కాశీబుగ్గ: కాశీబుగ్గ రూరల్ వాటర్ సప్లయ్ జూనియర్ ఇంజినీర్ కార్యాలయంలో చోరీ జరిగింది. కార్యాలయం వెనుక భాగంలోని కిటికీ విరగ్గొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు విలువైన రికార్డులను నాలుగు గోనె సంచుల్లో వేసి మూటలుగా కట్టి ఎత్తుకెళ్లారు. వాటిని సమీపంలోని రద్దు షాపులో విక్రయించారు. ఈ దృశ్యాలు పక్కనున్న ఎంపీడీవో కార్యాలయంలోని సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. సీసీ ఫుటేజ్ ఆధారంగా అనుమానితులను గుర్తించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఎస్పీని కలిసిన కాశీబుగ్గ డీఎస్పీ



ఎస్పీ మహేశ్వరరెడ్డితో డీఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : సాధారణ బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ డీఎస్పీగా వచ్చిన పి.శ్రీనివాసరావు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గుంటూరు జిల్లా డీసీఆర్బీ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో కాశీబుగ్గ, మందస ఎస్‌ఐగా కూడా పనిచేశారు.

పీజీ కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పీజీసెట్-2024 ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. డాఅంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సుల్లో 559 సీట్లు ఉన్నాయి. వర్సిటీ అనుబంధంగా ఏడు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 556 సీట్లు ఉన్నాయి. ఈ నెల 7 నుంచి 12 వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. పీజీ సెట్‌ను ఆంధ్రా విశ్వవిద్యాలయం నిర్వహించింది. పూర్తి వివరాలు ఏపీఎస్‌హెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్‌లో పొందుపర్చారు.

విరాళాల ముసుగులో..
వసూళ్ల పర్వం



- అమరావతి రాజధాని కోసం డ్వాక్రా సభ్యుల నుంచి రూ.100 వసూలు చేయాలని హుకుం
- గ్రూపు అధ్యక్షులకు వసూళ్ల బాధ్యత
- జిల్లాలో డ్వాక్రా సంఘాల నుంచి రూ. 6కోట్ల 50లక్షలకు టార్గెట్
- వెలుగులోకి వచ్చిన రిసోర్స్ పర్సన్ ఆడియో క్లిప్పింగ్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎవరైనా స్వచ్ఛందంగా నగదు అందిస్తే.. దాన్ని విరాళం అంటారు. కానీ టీడీపీ లెక్కలు వేరు.. బలవంతంగా వసూళ్లకు పూనుకుని దానికి విరాళాల కలర్ ఇస్తున్నారు. తాజాగా అమరావతి నిర్మాణం పేరుతో డ్వాక్రా సభ్యుల నుంచి రూ.100 చొప్పున వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు ఓ ఆడియో క్లిప్పింగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎందుకు.. ఏమిటీ అని అడక్కుండా ప్రతి ఒక్కరూ రూ.100 ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

'అమ్మా అందరికీ నమస్కారం. అమరావతి రాజధాని కోసం ఒక్కొక్క సభ్యురాలి నుంచి రూ.100 కలెక్ట్ చేయాలి. చాలా వరకు గ్రూప్ లీడర్లకు ఫోన్ చేశాను. ప్రతి గ్రూప్ లీడర్ ఫాలో అప్ చేయాలి. ప్రతి సంఘంలో ఎంత మంది సభ్యులున్నారో అంతమంది నుంచి కలెక్ట్ చేయాలి. రేపు సాయంత్రంలోగా అందించాలి. అధ్యక్షురాళ్లు వసూలు చేసింది ఎస్ఎల్ఎఫ్‌లో వేస్తాం. ఎన్ని సంఘాలవాళ్లు ఇచ్చారన్నది సీఓకి మెసేజ్ పెట్టాలి. ఎస్ఎల్ఎఫ్ అకౌంట్ నుంచి డీఎల్ఎఫ్ అకౌంట్‌లో వేస్తాం. ఆ తర్వాత ఏం చేయాలో వాళ్లు చూసుకుంటారు. ఎందుకు...ఏమిటీ అని అడగొద్దు' అంటూ సాగిన రికార్డెడ్ ఆడియో క్లిప్పింగ్‌ను జిల్లాలోని డ్వాక్రా సంఘాల వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. ఈ రికార్డింగ్ ఆడియో క్లిప్పింగ్‌లో ఉన్నది శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేటకు చెందిన రిసోర్స్ పర్సన్ వాయిస్‌గా తెలిసింది. ఇప్పుడీ ఆడియో క్లిప్పింగ్ తెగ వైరల్ అవుతోంది.

జిల్లాలో రూ.6.5కోట్ల టార్గెట్

అమరావతి రాజధాని కోసం జిల్లాలోని డ్వాక్రా మహిళల నుంచి రూ.6కోట్ల 50లక్షల మేర వసూలు చేయాలన్నది టార్గెట్‌గా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దల ఒత్తిడి మేరకు డ్వాక్రా సంఘాలకు నాయకత్వం వహిస్తున్న వారి ద్వారా వసూలు చేయాలని ప్లాన్ చేశారు. ప్రస్తుతం జిల్లాలో 1224 గ్రామైక్య సంఘాల ఉన్నాయి. అర్బన్ పరిధిలో 5,640 సంఘాలుండగా, రూరల్ పరిధిలో 49,104 సంఘాలున్నాయి. మొత్తం 54,743 సంఘాలుండగా వాటిలో 6లక్షల 44వేల 637మంది సభ్యులుగా ఉన్నారు. వీరందరి దగ్గరి నుంచి బలవంతంగా రూ.100 చొప్పున వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరితో పాటు సిబ్బంది నుంచి కూడా వసూలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ లెక్కన ఒక్క డ్వాక్రా సంఘాల మహిళల నుంచే రూ. 6కోట్ల 50లక్షల మేర వసూలు చేసేందుకు టార్గెట్ ఫిక్స్ చేశారు. ఎందుకు ఇవ్వాలని ఏ ఒక్కరూ ప్రశ్నించకూడదన్న షరతు కూడా పెట్టడంతో డ్వాక్రా మహిళలు ఏం చేయాలో తలలు పట్టుకోవాల్సి వస్తోంది.

మెట్టవలసలో అదుపులోకి రాని డయేరియా

- 63కు చేరిన బాధితుల సంఖ్య
- పరిశీలించిన డీఎంహెచ్ఓ మీనాక్షి



వైద్యసేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

జి.సిగడాం:

మండలంలోని మెట్టవలసను డయేరియా వీడటం లేదు. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా మంగళవారం 16 కేసులు నమోదుకావడంతో మొత్తం అతిసార బాధితుల సంఖ్య 63కు చేరింది. వీరిలో 38 మంది శ్రీకాకుళం, రాజాం, పొందూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారంతా గ్రామంలోనే వైద్యం చేయించుకుంటున్నారు. స్థానిక వైద్యాధికారులు బుడుబూరు యశ్వంత్, పేకల సుమబిందు వైద్యసేవలు అందిస్తున్నారు. మరోవైపు సర్పంచ్ కామోజుల ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి, నాయకులు బెవర జగన్నాథం, సీతారాం, శ్రీకాకుళం డివిజనల్ పంచాయతీ అధికారి జి.గోపీబాల, ఎంపీడీఓ కె.వెంకన్నబాబు, మండల పంచాయతీ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి ఎస్.రాజారమేష్, ధర్మవరపు సతీష్ పర్యవేక్షణలో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టుతున్నారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి..

జిల్లాలో డెంగీ, మలేరియా జ్వరాలతోపాటు అతిసార వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. మెట్టవలసలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో మంగళవారం పర్యటించి పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధుల తీవ్రత పెరిగితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం సీతామహాలక్ష్మి పౌల్ట్రీని సందర్శించి మెట్టవలసలో అతిసార వ్యాధితో బాధపడుతున్నారని సహాయ సహకారాలు అందించాలని ఎండీ కొల్లూరు వెంకట నాగేశ్వరరావును కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, పేడాడ సత్తెరాజు, భాస్కరరావు, ఏఎన్ఎం నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ కెజియా పాల్గొన్నారు.

అతిసార వ్యాధికి బలికావద్దు



డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్ఓ

అరసవల్లి: జిల్లాలో అతిసార కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జి.సిగడాం మండలం మెట్టవలసలో ఈనెల 4న 25 కేసులు, 5న 10 కేసులు, 6న మరో 10 కేసులు నమోదయ్యాయి. ఇదే తీవ్రత జిల్లా వ్యాప్తంగా ప్రబలుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వందల్లో జ్వరపీడిత కేసులు, వైరల్ ఫీవర్లు నమోదవుతున్న తరుణంలో ఇప్పుడు అతిసార కేసులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి పలు సూచనలు చేశారు.

- జిల్లాలో ఇప్పుడు ఫీవర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అలాగే ఇప్పుడు డయేరియా (అతిసార) కేసులు కూడా ఆందోళన పెంచుతున్నాయి.
- ఇప్పటికే పీహెచ్‌సీల వారీగా జ్వర పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యాధిబారిన పడిన వారి సంఖ్య పెరుగుతోంది. విరేచనాలు, వాంతులే అతిసారం లక్షణాలుగా కనిపిస్తాయి. ఇందుకు ప్రధాన కారణం మనం తినే ఆహారం. మన చుట్టూ ఉన్న అపారిశుద్ధ్యం. ముఖ్యంగా తాగే నీరే కారణం.
- ఇప్పటికే డయేరియా ఉన్న ప్రాంతాల్లో తాగునీటి పరీక్షలు చేయిస్తున్నాం. డయేరియా బారిన పడకుండా ఉండాలంటే కచ్చితంగా వేడి చల్లార్చిన నీటిని వినియోగించాలి. పరిశుభ్ర వాతావరణం మన చుట్టూ ఉండేలా చూసుకోవాలి. జంక్ ఫుడ్ ఎక్కడా తినకూడదు. కోళ్లఫారాల వద్ద ఎక్కువగా ఉండకూడదు. ఇక్కడుండే ఈగలు ఎక్కువగా మన మీద ప్రభావం చూపే ప్రమాదముంది.

ప్రజా సమస్యలపై దృష్టిసారించండి

- శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



శాసన మండలి ఛైర్మన్ మోషేన్‌రాజుతో ఎమ్మెల్సీ నర్తు రామారావు, నాయకులు

కవిటి: ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పేదలకు అండగా నిలవాలని ఏపీ శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావు నివాసంలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. నాయకులు వ్యక్తిగత పనులకే కాకుండా తమను నమ్ముకున్న వారికి నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో ఎదురయ్యే సమస్యలను పర్యవేక్షించి నిరంతరం వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, నాయకులు కారంగి మోహనరావు, వజ్జ మృత్యుంజయరావు, ఇందుగు ప్రకాశరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన'చోరుడు' అరెస్టు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలతో రెండో పట్టణ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో సిబ్బంది వాహనాలు పోతుండటంతో నిఘా పెట్టిన టూటౌన్ పోలీసులకు అదే చోట మరోసారి చోరీయత్నం చేస్తూ పట్టుబడ్డాడో వ్యక్తి. సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. గతంలో రిమ్స్ ఆస్పత్రి బయట పార్కింగ్ చేసిన తమ ద్విచక్ర వాహనాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారంటూ అక్కడి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులుగా ఎస్ఐ హరికృష్ణ తమ సిబ్బందితో కలిసి నిఘా పెట్టించారు. ఈ క్రమంలో మంగళవారం కొమ్ము రాజేష్ అనే వ్యక్తి అదే చోట మరలా చోరీ యత్నం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రాజేష్‌ను అదుపులో తీసుకుని అతని వద్ద నుంచి మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు.

నేడు ఎన్ఎస్ఎస్ పీవోల సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) పీవో (ప్రోగ్రాం అధికారులు)లతో బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త ఎం.అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మెయిన్ సెమినార్ హాల్లో జరిగే ఈ సమావేశానికి పీఓలు విధిగా హాజరుకావాలని కోరారు.

బీటెక్ సెమిస్టర్ ఫీజు స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఈ ఈ నెల 13లోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ ఇసుక రీచ్ నుంచి అనధికారంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలోని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. రీచ్‌లకు అనుమతులు లేవని, అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై స్పష్టం చేశారు.

వలియాసాగరంలో జ్వరాల విజృంభణ

టెక్కలి రూరల్: మండలంలోని వలియాసాగరంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో సుమారు 60 ఇళ్లు ఉండగా ఇప్పటికి 30 మందికి పైగా జ్వరాలబారిన పడి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. మరికొందరు ఇంటి వద్దనే ఆర్ఎంపీలతో వైద్యం చేయించుకుంటున్నారు. ఎక్కువ మంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం, బావుల్లో క్లోరినేషన్ చేపట్టకపోవడం వల్లే వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సిబ్బంది స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నైపుణ్య విద్యకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్

ఎచ్చెర్ల క్యాంపస్: నైపుణ్య విద్యతోనే ఉత్తమ మానవ వనరులు సాధ్యమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వపు వైస్ చాన్సలర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అంబుడ్స్ పర్సన్ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్ అన్నారు. ఎచ్చెర్లలోని అంబేడ్కర్ వర్సిటీలో ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల మొదటి ఏడాది క్లాస్‌వర్క్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్‌పై పట్టు అవసరమని చెప్పారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్, ఆటోమొబైల్స్, ఎయిర్‌క్రాఫ్ట్, టెలికాం, ఆగ్రో మెకానిజమ్, టెలివిజన్, వాటర్ సప్లయ్, నానో టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, మిషన్ లెర్నింగ్ వంటి రంగాల్లో మంచి ప్యాకేజీలతో విద్యార్థులు ప్లేస్‌మెంట్లు సాధిస్తున్నారని తెలిపారు. విశ్రాంత ప్రిన్సిపాల్, సివిల్ జడ్జి, వర్సిటీ అంబుడ్స్ పర్సన్ జి.వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని మాట్లాడుతూ ప్రముఖులు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో సేవలు అందించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలి



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికులపై వార్డు సెక్రటరీలు, టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు వేధింపులు ఆపాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ విస్తీర్ణం పెరిగినందున, అందుకు తగినట్లుగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ధర్నా చేపట్టి కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.బలరాం, ఎ.గణేష్ మాట్లాడుతూ చనిపోయిన కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పనిభారం తగ్గించాలన్నారు. నగర పరిధి విస్తరించినా కార్మికుల సంఖ్యను పెంచకుండా ఉన్న వారితోనే చాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. పని ప్రదేశాల్లో మహిళలకు మరుగుదొడ్లు లేవని, కార్మికుల విధి నిర్వహణకు అవసరమైన పనిముట్లు లేకుండా ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. దీనిపై పలుమార్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మస్టరు పాయింట్ల వద్దే ఎఫ్ఆర్ఎస్ తీయాలన్నారు. వార్డు సెక్రటరీ, టీడీపీ వార్డు ఇన్‌చార్జిలు వేర్వేరు పనులు చెబుతున్నారని, ఒకే వ్యక్తి అన్ని పనులు చేయడం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. ఊడ్చడం, కాలువలు తీయడం, ఎత్తుకోవడం ఒక్కరే చేయడం తలకుమించిన భారంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, డి.యుగంధర్, ఎ.గురుస్వామి, ఎ.శంకర్, ఎ.రాము, డి.చిట్టి, ఎ.జనా, ఎ.మాధవి, టి.వెంకటలక్ష్మి, ఎ.లక్ష్మి, డి.దేవి,ఎ.జ్యోతిప్రసాద్, ఎ.పూలవతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సందీప్

శ్రీకాకుళం న్యూకాలనీ: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ ముఖ్యంగా బాలికలు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐ వి.సందీప్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ అధ్యక్షతన 'సైబర్-నేరాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లైసెన్స్, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం నేరమన్నారు. సెల్‌ఫోన్లలో ఫేక్ మెసెజ్‌లకు, రివార్డ్స్, రీచార్జ్ ఫ్రీ, లాటరీ విన్నర్స్ అంటూ వచ్చే మెసెజ్‌లకు స్పందించవద్దని హితవుపలికారు. వీలైనంత మేర సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై 1930, ఇతర నేరాలు, అత్యవసర సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో-ఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కామర్స్ హెచ్ఓడీ లబ్బ కృష్ణారావు, లలితాబాయ్, సంతోషి, పావని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

30 రోజులు.. 15 చోరీలు!

- టెక్కలిలో వరుస దొంగతనాలు
- బిక్కుబిక్కుమంటున్న జనాలు



ద్విచక్రవాహనం చోరీకి ప్రయత్నిస్తున్న దొంగ(ఫైల్)

టెక్కలి రూరల్: టెక్కలి పరిసర ప్రాంతాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస చోరీలతో ప్రజలను హడలెత్తిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో 15కు పైగా దొంగతనాలు జరిగాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మాట్లాడుతుండగా సెల్‌ఫోన్లు పట్టుకుపోవడం, రాత్రిపూట ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తే ఉదయానికే మాయం చేయడం, బంగారం షాపుల్లో చాకచక్యంగా నగలు కొట్టేయడం, నివాస సముదాయాలను కొల్లగొట్టడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారింది. దీంతో ఎప్పుడు ఎక్కడ చోరీ జరుగుతుందోనని ప్రజలు భయంతో కంటిమీద కునుకులేకుండా పోతోంది. ముఖ్యంగా తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు.

ఇటీవల ఘటనలు పరిశీలిస్తే..

- జూన్ 17న కచ్చేరివీధిలోని బంగారం దుకాణంలో పట్టపగలే ఓ వ్యక్తి లోపలికి వెళ్లి బంగారు గొలుసులు చూస్తానని చెప్పి వాటితో ఉడాయించాడు. ఈ ఘటనలో సుమారు మూడు తులాల బంగారం చోరీ జరిగింది.
- జూన్ 23న వెంకటేశ్వర కాలనీ-3లో సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ఇంటితో పాటు అదే చోట ఉన్న గ్రానైట్ కంపెనీలో సైతం దొంగతనం జరిగింది.
- జూన్ 24న వంశధార కాలనీలో నివాసముంటున్న ఓ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో బంగారం, నగదును దుండగులు పట్టుకుపోయారు.
- జూలై 11న కొత్తమ్మతల్లి వీధిలోని కోరు మోహన్‌రావు అనే రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి ఇంట్లో దుండగులు చొరబడి 3 తులాల బంగారం, 400 గ్రాముల వెండి వస్తువులు చోరీ చేశారు.



ఓ ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న సామగ్రి(ఫైల్)

- జూలై 12న అర్ధరాత్రి అయ్యప్పనగర్‌లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సంచరించడంతో స్థానికులు గుర్తించి రాళ్లతో వెంటబెట్టారు.
- జూలై 25న ఇసుక లోడ్ కోసం పార్కింగ్ చేసిన ట్రాక్టర్లలో బ్యాటరీలు చోరీకి గురయ్యాయి.
- జూలై 31న రోటరీనగర్-1 లో నివాసముంటున్న కర్రి వేణుగోపాల్ అనే ఉపాధ్యాయుడి ఇంట్లోకి ఇద్దరు చొరబడి యజమానిని కిందకు నెట్టేసి 12 తులాల బంగారం, 1.5 కేజీల వెండి, రూ.3.5లక్షల నగదు చోరీ చేశారు.
- ఇవే కాకుండా ఇళ్ల ముందు పార్కు చేసి ఉన్న ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్‌లు లెక్కలేనన్ని చోరీ జరిగాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సైతం బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారంటూ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి నిఘా పెట్టి చోరీలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిఘా వేశాం..



చోరీలు జరగకుండా నిఘా వేశాం. చోరీ కేసుల్లో అనుమానితులను గుర్తించి విచారణ చేస్తున్నాం. గత నెలలో గోల్డ్ షాపులో చోరీ చేసిన ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. మిగిలిన కేసుల్లోనూ నిందితులను త్వరలోనే పట్టుకుంటాం.

– పి.పైడయ్య, సీఐ, టెక్కలి